ప్రజాశక్తి

మంగళవారం 28 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నగర జీవికి ఉక్కపోత

- మరో వారం పాటు వేడిగాలులు
- పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు
- జూన్ 5 తర్వాతే.. నైరుతి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉమ్మడి విశాఖ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో జూన్ 1లోపు అక్కడక్కడా అడపాదడపా వర్షాలు పడినా ఉదయం వేళ ఎండలు దంచికొట్టనున్నాయి. వేడి తీవ్రత పలుచోట్ల పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉక్కపోతతో విశాఖ నగర జీవులు అవస్థలు పడుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో కరెంట్ కోతలు పది రోజులుగా నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ పెరిగాయి. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకే వరకూ ఎండల తీవ్రత కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెమాల్ తుపాను వచ్చినప్పటికీ అది బంగ్లా వైపు వెళ్లిపోవడంతో తేమ వాతావరణంతో సముద్ర తీరం విశాఖలో ఉష్ణోగ్రతలు, వేడి పెరిగాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు ఇప్పటికే వెల్లడించారు. జూన్ 3 వరకూ ఉక్కపోత వాతావరణమే ఉంటుందని చెబుతున్నారు. జూన్ 5 తరువాతే నైరుతి రుతుపవనాల ఆగమనం ఉండొచ్చని అంటున్నారు.

పొడి వాతావరణం

తీర ప్రాంతం అంతటా పొడి వాతావరణం నెలకొంది. విశాఖలో పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల వరకూ ఉంటున్నాయి. మరో 3 రోజుల పాటు ఇవే పరిస్థితులు కొనసాగనున్నాయి. కృష్ణా, గుంటూరు, విజయవాడ, ఒంగోలు తదితర చోట్ల ఇప్పటికే మిగతా 2లో..

సగం కూడా రాని పాఠ్యపుస్తకాలు

◆ 6.60 లక్షలకు 2.13 లక్షలు చేరిక ◆ విద్యార్థులకు సకాలంలో అందేనా ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాదీ పాఠశాలల పున్ణప్రారంభం నాటికి ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు సంపూర్ణంగా అందించే పరిస్థితి కన్పించడం లేదు. జిల్లాకు అవసరమైన పుస్తకాల్లో సగం కూడా ఇప్పటి వరకూ చేరలేదు. ఎన్నికలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో జాప్యం చోటుచేసుకుంది. ప్రభుత్వ యంత్రాంగం అధిక భాగం ఎన్నికల పనిలో ఉండడంతో పాఠ్యపుస్తకాల పంపిణీపై తగిన శ్రద్ధ చూపలేకపోయారు. దీంతో వచ్చే నెల 12న పాఠశాలలు తెరుస్తున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని స్థితి ఉంది. జిల్లాలో ఒకటి నుంచి పది విద్యార్థుల వరకు 4,64,828 పాఠ్యపుస్తకాలు, 1,95,247 వర్క్ బుక్స్ కలిపి 6,60,075 పుస్తకాలు అవసరం ఉంది. వీటిలో ముద్రణ సంస్థల నుంచి నేరుగా మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలకు ఇంతవరకు పాఠ్యపుస్తకాలు 1,68,712, వర్క్ బుక్స్ 44,542 వెరసి 2,13,254 పుస్తకాలు చేరాయి. ఇంకా పాఠ్యపుస్తకాలు 2,96,116, వర్క్ బుక్స్ 1,50,705 వెరసి 4,46,821 పుస్తకాలు రావాల్సివుంది.

8, 9, 10 తరగతుల పుస్తకాలు మండల విద్యాశాఖాధికారులకు పంపుతుండగా మిగిలిన తరగతుల

పుస్తకాలు గాజువాకలోని గోదాముకు చేరుతున్నాయి. 9, 10 తరగతుల విద్యార్థుల పుస్తకాలు సంపూర్ణంగా వచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు సరిపడా పుస్తకాలు చేరుతాయని ఆమె అన్నారు. ఈ ఏడాది సకాలంలో పుస్తకాలు అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. విద్యార్థులకు పంపిణీ చేసే బ్యాగ్‌లను మండల కేంద్రాలకు కంపెనీ నుంచి చేరవేయనున్నారు. విద్యాశాఖాధికారుల ప్రతిపాదనల ప్రకారం పంపిణీలో ఆలస్యం లేకుండా నేరుగా మండల కేంద్రాలకు చేరవేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

▸ వార్త 2లో..

పాలిటెక్నిక్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

▸ వార్త 2లో..

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

▸ వార్త 2లో..

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

విద్యుత్ ఛార్జీల పెంపుపై

స్టీల్ టౌన్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

పెంపు సర్క్యులర్‌ను రద్దు చేయాల్సిందే : సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కునగరంలో విద్యుత్ ఛార్జీలను పెంచుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సర్క్యులర్‌ను జారీ చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం స్టీల్ అడ్మిన్ బిల్డింగ్‌ను ఉక్కు కార్మికుల కుటుంబాలు ముట్టడించాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీల పెంపు సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని పూర్తిస్థాయిలో చేయకుండా వాటిని ప్రైవేట్‌కు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ఎపిఇపిడిసిఎల్ నుండి కర్మాగారం కొన్న రేటుకే గృహ వినియోగదారులు ఛార్జీలు చెల్లించాలని యాజమాన్యం చెప్పడం దుర్మార్గమన్నారు. ఇప్పుడు నెలకు రూ.400 చెల్లించే వారు తాజా సర్క్యులర్‌తో అమలయ్యే ఛార్జీలతో రూ.6400 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏకంగా 16 రెట్లు ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.విమల, సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు, స్టీల్ సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, స్టీల్ సిఐటియు నాయకులు పుల్లారావు, ఆర్.వెంకట్రావు, కె.బాలశౌరి, మొహిద్దిన్, స్టీల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షులు వివి.రమణ పాల్గొన్నారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

CBSE 10వ తరగతి 12వ తరగతి 2024 పరీక్ష ఫలితాల్లో

"ఆపిల్ ఐ విద్యార్థుల విజయభేరి"

10వ తరగతి మరియు 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో గత 10 సంవత్సరాలుగా 100% ఫలితాలు మరియు 100% First Classes సాధించి విశాఖ నగరంలో చరిత్ర సృష్టించిన ఏకైక CBSE విద్యాసంస్థ apple i school

12th Std 90% పైగా మార్కులు సాధించిన విద్యార్థులు



SHOURYA YADHAV 94.6% (BiPC) | N. HARI RAM TEJ 91.6% (MPC) | P. SIDDARDHA 91.2% (MPC) | SRIDHANT DALAI 90.8% (MPC) | SAYAN NANDI 90.6% (CEC)

10th Std 90% పైగా మార్కులు సాధించిన విద్యార్థులు

SHOURYA VARDHAN 95% | P. SRI RAAM PRANAV 92.3% | BHAWANA BUGALIA 90.3% | K. CHARISMA 90.2% | M. JASWANTH RAM 90%

నర్సరీ నుండి 11వ గ్రేడ్ వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి (పరిమితమైన సీట్లు మాత్రమే కలవు)

అడ్మిషన్ల కొరకు స్కూల్ ఆఫీస్ నందు సంప్రదించగలరు

apple i

CBSE School

81212 24477, 98481 12642

Srinagar, Gajuwaka, Vizag-26.

అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - ములగాడ

సొంత మనవరాలుపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఇక ఆ కేసు వివరాల్లోకి వెళితే.. ఎవరూ లేని సమయంలో ఐదో తరగతి చదువుతున్న మనవరాలుపై సదరు వ్యక్తి శ్యామ్ సుందర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం నిందితుడు శ్యామ్ సుందర్‌కి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది తీర్పునిచ్చారు. బాధితురాలి తరుపున వాదించి న్యాయం జరిగేలా చూసిన స్పెషల్ పోక్సో పీపీ కరణం కృష్ణకు పలువురు ధన్యవాదాలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

నగర జీవికి ఉక్కపోత

40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. ఉత్తరాంధ్రలో కూడా మరో 2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పొడి వాతావరణం నేపథ్యంలో పెరగనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం విశాఖలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. సాయంత్రం అయ్యేసరికి కొంత వరకు చల్లగాలులు వీస్తున్నా వర్షాలు పడకపోవడంతో, పొడి వాతావరణంతో ఉక్కపోత పెరిగి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని, అధికారులందరూ అందుకు సమాయత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలని, సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృతి చేసుకోవాలని సూచించారు. జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియపై స్థానిక చిల్డ్రన్ ఎరీనాలో సోమవారం ఉదయం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు విధానంలో అనుసరించాల్సిన విధివిధానాలపై మార్గనిర్దేశం చేశారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియను అందరూ చాలా సమర్థవంతంగా నిర్వహించారని, ఫలితంగా గతం కంటే ఎక్కువగా పోలింగ్ శాతం నమోదయ్యిందని తెలిపారు. అదే చొరవను కౌంటింగ్ ప్రక్రియలో కూడా చూపించి విజయవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియ గురించి, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అక్కడ అనుసరించే విధానాలు, సంప్రదాయాల గురించి సూక్ష్మంగా వివరించాలని చెప్పారు. ఎలాంటి ఘర్షణ వాతావరణమూ చోటు చేసుకోకుండా ఆర్ఒలు అప్రమత్తంగా ఉండాలని, సమయ స్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ అంతా పూర్తి పారదర్శక విధానంలో, పూర్తి స్థాయి పర్యవేక్షణలో జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అంశమూ వీడియో రికార్డింగ్ జరుగుతుందని, అలాగే సీసీ కెమెరాలు కూడా ఉంటాయని స్పష్టం చేశారు. ఇవిఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు సమయంలో బెల్ ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని, ఏమైనా అనుకోని విధంగా సాంకేతిక సమస్యలు వస్తే కంగారు పడొద్దని, వారి సహాయం తీసుకోవాలని సూచించారు. 17 సీ పార్ట్-1, 17 సీ పార్ట్-2లో నిక్షిప్తమైన వివరాలను బేరీజు వేసుకోవాలన్నారు. సదస్సులో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు, ఎఆర్ఒలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దాడి సత్యనారాయణకు డాక్టరేట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణకు అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి చేతుల మీదుగా అవార్డును అందించారు. ఈ సందర్భంగా సోమవారం సత్యనారాయణ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో తాను ఐకాన్ సంస్థ ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా భీష్మ అవార్డును సైతం అందుకున్నట్లు తెలిపారు. అమెరికన్ సంస్థ ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్శిటీ వారు తాను నగరంలో ప్రజలకు, కళాకారులకు అందిస్తున్న సేవలను గుర్తించి తాజాగా డాక్టరేట్ అందించారన్నారు. ఈ డాక్టరేట్ రావడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. దాడి సత్యనారాయణకు దక్కిన డాక్టరేట్ పట్ల ప్రముఖ నిర్మాత, టిడిపి సీనియర్ నేత, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కంచర్ల అచ్యుతారావు, ఆయన కుమారుడు హీరో ఉపేంద్రలు హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపారు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు, ఎపి మా బృందం సభ్యులు సత్యనారాయణకు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 596 జిఒ ప్రకారం రిజిస్టర్ అయిన అసైన్డ్ భూముల బదలాయింపులను తక్షణమే నిలిపివేయాలని, మోసపూరిత రిజిస్ట్రేషన్లపై హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తిచే విచారణ జరపాలని విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల విశాఖ, విజయనగరం జిల్లాల్లో వెలుగు చూసిన అసైన్డ్ భూములు అక్రమ కొనుగోలు కుంభకోణంపై గవర్నర్‌కు, ల్యాండ్ పరిపాలన ముఖ్య కమిషనర్‌కు, విశాఖ కలెక్టరుకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, కొల హరిబాబు, గుడివాడ ప్రసాద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

29న ఓపెన్ హైమర్ చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ఆస్కార్ సంబరాలలో ప్రథమ బహుమతి పొందిన కృష్ణ ఫర్ నోటెన్ దర్శకత్వంలో రూపొందిన ఓపెన్ హైమర్ ఇంగ్లీష్ చిత్రాన్ని బుధవారం సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయం హాలులో ఉచితంగా ప్రదర్శించనున్నారు. అందుకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. సినీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9032477463 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

వర్ధంతి సభల్లో వక్తలు

విశాఖలో కందుకూరికి నివాళ్లర్పిస్తున్న నాయకులు, చిన్నారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, కరాస : గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం అని పలువురు వక్తలు కొనియాడారు. కందుకూరి వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన నగరంలోని హష్మీ భవనంలో సోమవారం ఆ మహనీయునికి ఘనంగా నివాళ్లర్పించారు. ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అరుణ్‌జీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, చంటి, డ్యాన్స్ టీచర్ రాగిణి, సంగీతం టీచర్ శ్రీదేవి, అక్కడే సమ్మర్ క్యాంపులో పాటలు, డ్యాన్సులు నేర్చుకుంటున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి నాయకులు రమణ, చంటి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం సమాజ మార్పునకు విశేష కృషి చేశారన్నారు. విద్య అందరికీ దక్కాలని ఆనాడే గొంతెత్తారన్నారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిన ధీశాలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

కశింకోట : ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం 105వ వర్ధంతి కార్యక్రమం కశింకోటలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు కందుకూరి చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, కార్యదర్శి సూర్యలక్ష్మి, ఆర్.అమ్మాజీ, సత్యవతి, బి.మాలెమ్మ, పూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో నివాళ్లర్పిస్తున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

దళితుల భూములను పరిరక్షించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్రలో బయటి వ్యక్తుల ద్వారా దళితుల డి.ఫారం భూములను స్వాధీనం చేసుకోవడం, ఆక్రమించడం వంటి అక్రమాలు, భూ కుంభకోణంపై విచారణ జరిపి భూములను కాపాడాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ విసి, యుపిఎస్‌సి పూర్వ ఛైర్మన్ ఆచార్య కెఎస్.చలం లేఖ రాశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్డ్ కులాలు, ఇతర బలహీన వర్గాల అసైన్డ్ (డి.ఫారమ్ పట్టా) భూముల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారుల ప్రమేయంతో తీవ్ర కుంభకోణం జరిగినట్టు భావిస్తున్నానన్నారు. దళితులకు చెందిన భూములు ఇప్పటికే వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. తక్షణమే ఉత్తరాంధ్రకు అధికారుల బృందాన్ని తనిఖీకి పంపించాలని, మోసపూరిత వ్యవహారాలకు సంబంధించిన కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్ కొత్త రోడ్డు దగ్గరగల శ్రీ వాసవి కల్యాణ మండలంలో ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా డాక్టర్ ఉప్పల భాస్కరరావు, శ్రీ వంశీ, వెన్నకోటి రామ్మూర్తి, కందుల మూర్తి, ఎలమర్తి గణేష్ హాజరయ్యారు. ఈ పోటీల్లో 290 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ముమ్మన రిత్విక్, ద్వితీయ స్థానంలో ప్రేమ్ సాయి, తృతీయ స్థానంలో హర్ష కీర్తన్ నిలిచారు. విజేతలకు అసోసియేషన్ సభ్యులు భీమారావు, బాబూరావు, శ్రీకాంత్‌లు బహుమతులు ప్రదానం చేశారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఎంకె.బెహరా విశాఖపట్నంలో రైల్వే సౌకర్యాలు, అభివృద్ధి కార్యకలాపాలను సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌తో కలిసి ఆయన డివిజన్‌లోని పోర్టు అథారిటీ కంటైనర్ టెర్మినల్‌ను తొలుత సందర్శించారు, అక్కడ వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. అనంతరం వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం అదానీ గంగవరం పోర్ట్ అధికారులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. చివరగా డిఆర్‌ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ అధికారులతో ఆయన సమావేశ మయ్యారు. అధికారిక విషయాలపై సమీక్షించారు.

పాలిటెక్నిక్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాలిటెక్నిక్ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలను దక్కించుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు పూర్తి చేయవచ్చని, అందుకు పలు సంస్థలు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు అందివచ్చిన ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాబ్ ఎచీవర్స్ డే కార్యక్రమాలు సోమవారమూ కొనసాగాయి. విశాఖపట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల ఉద్యోగాలు సాధించిన 298 మంది విశాఖ విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు.

ఉద్యోగాలు సాధించిన వారితో కమిషనర్ నాగరాణి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారిలో 12 వేల మంది విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధించారన్నారు. వారి జీతభత్యాలు కూడా గణనీయంగా ఉన్నాయని, అనేక మంది విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతన ఆఫర్‌ను అందుకున్నారని, సగటు జీతం ప్యాకేజీ రూ.3 లక్షలుగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల నైపుణ్యం, సామర్థ్యంపై పరిశ్రమల విశ్వాసాన్ని ప్రతిబింబించేలా క్యాంపస్ ప్లేస్‌మెం ట్‌లు ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు అద్భుతమైన ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడానికి సాంకతిక విద్యా శాఖ కట్టుబడి ఉందన్నారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్‌లను తీర్చేలా వారిని సన్నద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ జివిఎన్.ప్రసాద్, ఒడిన్ కంట్రోల్ ఎమ్‌డి ఎస్.నందగోపాల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం గణపతి, సాంకేతిక విద్యా శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎంఎవి.రామకృష్ణ, సాంకేతిక విద్య శిక్షణా మండలి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జానకిరామయ్య, కళాశాల ప్రిన్సిపల్ కె.నారాయణరావు, టిపిఒ హరిబాబు పాల్గొన్నారు.

తిరుమల గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం

గ్యాస్ ఇబ్బందులు

తిరుమల ఏజెన్సీ నిర్వాకంతో ప్రజలకు అందని సిలిండర్

ప్రజాశక్తి -గాజువాక : కొత్త గాజువాకలోని తిరుమల గ్యాస్ ఏజెన్సీ నిర్వాకం వల్ల స్థానిక ప్రజలకు ఇండియన్ గ్యాస్ అందడంలేదు. గ్యాస్ అందక గాజువాక పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్కీ షాపింగ్ మాల్ పక్క రోడ్డులో గత 20 సంవత్సరాల నుంచి తిరుమల గ్యాస్ ఏజెన్సీ నడుస్తోంది. ఇండియన్ గ్యాస్ సిలిండర్లను ఖాతాదారులకు సరఫరా చేస్తోంది. ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి నెల రోజులుగా తిరుమల ఏజెన్సీ యజమాని జీతాలు చెల్లించలేదని డెలివరీ చేసిన బాయ్స్, ఆఫీసులో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది విధులకు రావడం మానివేశారు. దీంతో ప్రజలకు గ్యాస్ సిలిండర్లు అందని సమస్య ప్రారంభమైంది. బుక్ చేసి 20 రోజులైనా గ్యాస్ రాకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వీరి గ్యాస్ గొడౌన్ వంటిల్లు సమీపంలో ఉంది. అక్కడికి వెళ్లి గ్యాస్ సిలిండర్ తీసుకుందామంటే స్టాక్ లేదని గొడౌన్ ఇన్‌ఛార్జి చెబుతున్నారు. ప్రతిరోజూ వినియోగదారులు గ్యాస్ ఆఫీస్ చుట్టూ తిరగడం, ప్రశ్నిస్తున్నా ఎవరూ స్పందించడంలేదు. ఇంత జరుగుతున్నప్పటికీ కూతవేటు దూరంలోనే ఉన్న సివిల్ సప్లై అధికారులు ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

బుక్ చేసి 20 రోజులు

గ్యాస్ బుక్ చేసి 20 రోజులైంది. ఇంతవరకు గ్యాస్‌ను సరఫరా చేయలేదు. డెలివరీ బాయ్‌కి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. గ్యాస్ ఆఫీస్‌కు వెళ్తే సెక్యూరిటీ గార్డుతో బెదిరిస్తున్నారు.

కె. పెంటయ్య,
వికాస్‌నగర్.

తిరగలేకపోతున్నాం

గ్యాస్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగలేకపోతున్నాం. ఎండలో రోజూ గ్యాస్ కార్యాలయానికి వెళ్లివచ్చే క్రమంలో కళ్లు తిరుగుతున్నాయి తప్ప సిలిండర్ అందడంలేదు. గ్యాస్ ఆఫీసు వద్ద ఎవరూ పలకడం లేదు. చావో రేవో ఇక్కడే ఉంటాను.

కాసులమ్మ,
పాత గాజువాక.

సివిల్ సప్లై అధికారులు స్పందించాలి

గ్యాస్‌ను బుక్ చేసి 15 రోజులు గడుస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. సమీపంలోనే ఉన్న సివిల్ సప్లై అధికారులు స్పందించాలి. గ్యాస్ కోసమని రోజంతా తిరుగుతున్నాను.

బంగారునాయుడు,
నవాబునగర్.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని నక్కపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన బద్ద చిన్న అప్పారావు (36) చెరువులో పడి మృతి చెందాడు. ఈనెల 25న ఇంటి నుంచి బద్ద చిన్న అప్పారావు కూలి పనికి వెళ్ళాడు. తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం ఉపమాక పెద్ద చెరువులో మృతదేహం తేలి ఉండటంతో, కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి చూడగా చిన్న అప్పారావు అని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల సిఐలు విజయ్ కుమార్, అప్పన్నలతో పాటు క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి సిహెచ్‌సికి తరలించారు. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గఫూర్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని న్యాయంపూడి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. న్యాయంపూడి గ్రామం నుండి జాతీయ రహదారి మీదుగా సోమవారం ఉదయం సైకిల్ పై రెడ్డి అప్పారావు (59) ఉపాధి పనికి వెదుళ్ళపాలెం వైపు వెళుతున్నాడు. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి తలపై నుంచి వెళ్లి పోయింది. దీంతో, అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి వెంకటరావు కేసు నమోదు చేశారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధుడు అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి మసీదు రోడ్డు అశోక్‌నగర్ ఆర్‌హెచ్.కాలనీకి చెందిన మద్ది సూర్యనారాయణ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు గాంద్రేటి రమారాయో, శ్రాసియోరాయో చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస మూడు అమ్మ వార్ల గుడి ఎదురుగా ఉన్న మైదానంలో పోలమాంబ యూత్ ఆధ్వర్యాన ఐపిఎల్ తరహాలో భీమిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం టిడిపి నాయకులు అక్కరమాని వెంకటరావు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 7 ఫ్రాంఛైజ్ జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోలమాంబ ఫైటర్స్, అవెంజర్స్, బిఆర్ వారియర్స్, హిందూస్థాన్ ఎలెవెన్స్, మార్నింగ్ స్టార్స్, కింగ్స్ ఎలెవెన్స్, స్మాషర్స్ జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్ 14 రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ 20 వేలు ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్లు లోవరాజు, వెంకట్, రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ అధినేత ఆదిమూలం నాగరాజు, వెంపాడ వెల్ఫేర్ అధినేత వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో ప్రతిభ

ప్రజాశక్తి-ఆనందపురం : కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందపురం గ్రామానికి చెందిన చిన్నారులు పలు పతకాలు సాధించారు. విజయనగరం జిల్లా రాజీవ్ క్రీడా ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఖాతా విభాగంలో కుప్ప రేవంత్ కుమార్ (7) గోల్డ్ మెడల్, కుప్ప దేవిశ్రీప్రసాద్ (10) బ్రాంజ్ మెడల్, ముడసల సిద్దు (10) బ్రాంజ్ మెడల్, కుమితి విభాగంలో బ్రాంజ్ మెడల్, కుప్ప మనోజ్ కుమార్(10) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కక్కలు నిఖిలేశ్వర్ కుమార్ (10) ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఆనందపురం జడ్‌పి హైస్కూల్లో షాడోకాన్ కరాటే అకాడమీలో కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ ఆధ్వర్యాన వీరంతా శిక్షణ పొందుతున్నారని వివరించారు. కోచ్ ముగడ వెంకటరమణకు జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

గీతంలో నోటి కేన్సర్ అవగాహనా వారోత్సవం

పోస్టర్‌ను విడుదల చేస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : ఈ నెల 31వ తేదీన "నో టోబాకోడే" సందర్భంగా గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రజారోగ్య దంత వైద్య విభాగం, గీతం ఆసుపత్రి ఆధ్వర్యాన వారం రోజుల పాటు నోటి కేన్సర్‌పై అవగాహన స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సోమవారం గీతం జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకం నోటి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతం దంత కళాశాల, ఆసుపత్రి ప్రజారోగ్య దంత వైద్య విభాగం అధిపతి డాక్టర్ మనీష్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో ఏటా లక్ష మందికి పైగా ప్రజలు నోటి కేన్సర్ భారిన పడుతున్నారని తెలిపారు. పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడే వారు నోటి కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గీతం దంత కళాశాల ఆసుపత్రి, గీతం వైద్య కళాశాలలో స్క్రీనింగ్ పరీక్షలు ఈ నెల 27వ తేదీ నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. పొగాకు వాడుతున్న వారు ముందు జాగ్రత్తగా ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా రాబోయే ప్రమాదాన్ని తెలుసుకుని తగిన చికిత్సతో జాగ్రత్తపడవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎమ్.సతీష్, డాక్టర్ పి.సురేష్, డాక్టర్ దివ్య ఉప్పాల తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా రోబోటిక్ మోకాలి మార్పిడి చికిత్స

రోబోటిక్ మోకాలి మార్పిడి చికిత్సలు చేసిన వైద్య బృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రిలో అత్యంత త్వరితంగా వెలీస్ రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి 25 మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ మైలురాయిని సాధించిన బృంధంలో అపోలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నాయి. డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యాన డాక్టర్ రఘు యలపర్తితో కలిసి వైద్య బృందం ఈ రోబోటిక్ శస్త్ర చికిత్సలు అత్యున్నతంగా నిర్వహించారని తెలిపాయి. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ, రోబోటిక్ శస్త్ర చికిత్స సంప్రదాయ పద్ధతితో పోలిస్తే అత్యంత మెరుగైన, ఖచ్చితమైన ఫలితాలు అందిస్తాయని తెలిపారు. శస్త్ర చికిత్సకు సుమారు 75 నిమిషాలు పడుతుందన్నారు. రోగి త్వరితంగా కోలుకుంటారని తెలిపారు. అపోలో ఆసుపత్రిలో రోబోటిక్ శస్త్ర చికిత్సకు సంబంధించిన అన్ని ఆధునిక సాంకేతిక సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్య బృందం అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

రోడ్డుపై మట్టి పనులు

హాస్టల్ రోడ్డు పనులు ప్రారంభం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీ, బాలికల వసతి దృహం రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రోడ్డు చాలా అధ్వానంగా తయారుకావడంతో అధికారులు రోడ్డు నిర్మిస్తామని చెప్పి 8 నెలల క్రితం సుమారు రూ.8 లక్షలు కేటాయించి మట్టి పోసినా పనులను గాలికి వదిలేశారు. కాలనీవాసులు వాడుక నీరు పోవడానికి కాలువ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు కూపంగా తయారైంది. దీనిపై 'అధ్వాన స్థితిలో హాస్టల్ రోడ్డు' శీర్షికన ఈ నెల 15వ తేదీ ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. పైపులు వేసి రోడ్డు ఏర్పాటుకు సోమవారం పనులు ప్రారంభించారు. రోడ్డుకు మధ్యలో పైప్‌లైన్ వేసి ఇరువైపులా గృహాల నుంచి వచ్చే వ్యర్థపు నీరు పోవడానికి ఏర్పాటుచేశారు. అనంతరం సిసి రోడ్డు ఏర్పాటు చేయునున్నట్లు మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు, హాస్టల్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఎన్నికల ఫలితాల రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని నార్త్ జోన్ ఎసిపి బి.సివిల్ హెచ్చరించారు. జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న వి.కన్వెన్షన్ వేదికగా జివిఎంసి 5, 6, 7, 8 వార్డులలో ఉన్న అన్ని పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు.

విద్యుత్ కష్టాలు తీరేలా కంటైనర్ సబ్‌స్టేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : వేసవికాలంలో అక్కయ్యపాలెం ప్రాంత ప్రజలకు కరెంటు కష్టాలు తీరేలా ఇపిడిసిఎల్ అధికారులు చొరవ చూపించారు. జివిఎంసి 26వ వార్డులోని ఎన్జీవోస్ కాలనీ, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, రామకృష్ణనగర్, 80 అడుగుల రోడ్డు, శాంతిపురం, లలితానగర్, శ్రీనివాస్‌నగర్, అభిద్‌నగర్, రామచంద్రనగర్ తదితర ప్రాంతాలకు వేసవికాలం వచ్చిందంటే విద్యుత్ సరఫరా కష్టాలు వెంటాడేవి. విద్యుత్ వినియోగం పెరగడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్స్ ట్రిప్ అవడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులతో ఇబ్బందిపడేవారు. గత పదేళ్లుగా ఇళ్లల్లో ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు వాషింగ్ మిషన్లు, మోటార్లు వాడకం బాగా పెరగడంతో విద్యుత్ వినియోగం ఎక్కువైంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడి తరచూ ట్రిప్ అయ్యేది. డిమాండ్‌కు తగ్గ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ లేక విద్యుత్ సరఫరా నిలిచిపోయేది.

అక్కయ్యపాలెం ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఇప్పటివరకు రెండు 8 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవి. ఇవి ప్రజలు విద్యుత్ వినియోగాన్ని తీర్చలేక పోతున్నాయి. ముఖ్యంగా వేసవిలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. గత పదేళ్ల కాలంలో కొత్తగా సబ్‌స్టేషన్లు ఏర్పాటుకాలేదు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల శాచురేషన్‌కు చేరుకున్నాయి. విద్యుత్ సమస్య తీవ్రత మరింత పెరగడంతో ఇపిడిసిఎల్ అధికారులు చొరవ చూపారు. అక్కయ్యపాలెంలో నివసిస్తున్న సుమారు 25,000 మంది ప్రజలు 8000 కనెక్షన్లకు తగినట్టు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి తగిన స్థలం లేకపోవడంతో సుమారు రూ.10 కోట్లతో అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీ హైవేపై గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో అత్యధిక టెక్నాలజీతో 5 ఎంవిఎ కంటైనర్ సబ్ స్టేషన్‌ను, 1000 ఓల్టేజీ, 500 యాంప్ కెపాసిటీతో ఏర్పాటుచేశారు. దీనివల్ల 8000 విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుంది. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన ఈ కంటైనర్ సబ్‌స్టేషన్ రాష్ట్రంలోనే మూడోది. ఇటీవల ఎన్నికల సమయంలో ఈ సబ్‌స్టేషన్ ప్రారంభం కావడంతో అక్కయ్యపాలెం ప్రాంతానికి ఇబ్బందులు లేని విద్యుత్ సరఫరా అందుతోంది. మరో పదేళ్లలో పెరుగునున్న విద్యుత్ వినియోగాన్ని సైతం తీర్చేలా దీన్ని ఏర్పాటుచేశారు. భవిష్యత్తు అవసరాలకు 8 ఎంవిఎకు అప్‌డేట్ చేసుకోవచ్చు. విద్యుత్ సమస్యకు పరిష్కారం దొరకడటంతో అక్కయ్యపాలెం ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్జీవోస్ కాలనీ గ్రీన్ బెల్ట్ స్థలంలో ఏర్పాటుచేసిన కంటైనర్ సబ్‌స్టేషన్

కరెంటు కష్టాలు తీరాయి

వేసవికాలం వచ్చిందంటే అక్కయ్యపాలెం ప్రజలకు కరెంటు కష్టాలు మొదలయ్యేవి. పదేళ్లుగా విద్యుత్ సరఫరా సమస్యలతో ఇబ్బందిపడేవారం. కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఉంది.

కింతాడ శ్రీనివాసరావు
లలితానగర్ వాసి

విద్యుత్ వాడకం పెరగడంతో సమస్యలు

గడిచిన పదేళ్లలో విద్యుత్ వాడకం గణనీయంగా పెరగడంతో కరెంటు సమస్యలు తీవ్రంగా ఉండేవి. సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా కరెంటు సమస్య లేకుండా ఉంది. ఓల్టేజీ హెచ్చుతగ్గుల సమస్యలు తగ్గిపోయాయి.

శంకరరావు నాగులాపల్లి

నేడు 86, 87 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 86, 87 వార్డుల పరిధిలోని కాలనీలకు మంగళవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జివిఎంసి గాజువాక జోన్ వాటర్ సరఫరా అసిస్టెంట్ ఇంజినీర్ కేదారినాథ్ తెలిపారు. గాజువాక , సిద్ధార్థ నగర్ 12 ఎంఎల్‌డి పంప్ హౌస్‌లో పంపుల మరమ్మత్తుల వల్ల నీటిని సరఫరా చేయలేమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పెందుర్తిలో సాయిపుష్పజను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రా యూనివర్సిటీ విడుదలచేసిన డిగ్రీ ఫలితాల్లో ర్యాంకుల సాధించిన విద్యార్థులను పలు కళాశాలల్లో ఆయా యాజమాన్యాలు అభినందించారు.

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో 2023-24 డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థిని సిహెచ్ సాయిపుష్పజ బీకాం కంప్యూటర్స్‌లో ఆంధ్ర యూనివర్సిటీ సెకండ్ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎన్.ఇ.ఫ్లోరా తెలిపారు. విద్యార్థిని సాయి పుష్పజకు, తల్లిదండ్రులకు కాలేజీ ప్రిన్సిపల్ ఫ్లోరా, సెక్రటరీ టి.థియోఫిలాస్ పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎంవిఆర్ విద్యార్థినికి ప్రథమ ర్యాంకు

భావనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న డాక్టర్ వి.రామారావు

గాజువాక : ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించిన యూజీ పరీక్ష ఫలితాల్లో గాజువాక ఎంవిఆర్ కళాశాలలో బీఎస్సీ చదివిన మెండ భావన (9.91) సిజిపిఎతో ప్రథమ ర్యాంకు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.రామారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థినికి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి సైంటిస్ట్‌గా స్థిరపడతానని భావన తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో శ్రీశుభశ్రీ ఫంక్షన్ హాల్ సమీపంలో కూడలి వద్ద రోడ్డు పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఇక్కడ తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డు మలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడి నిత్య ప్రమాదాలకు గురవుతుంది. ఇటీవల ఒక వ్యక్తి రెప్పపాటులో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వాహనదారులు ఆ గుంతలో పడి నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి -గాజువాక : కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో గాజువాకలో ఎన్నో పోరాటాలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు సాధించామని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు. సిపిఎం జోగవానిపాలెం శాఖ కార్యదర్శి డాక్టర్ పి.లక్ష్మణస్వామి ఆధ్వర్యాన సోమవారం స్వామి విద్యానికేతన్ పాఠశాలలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎం.రాంబాబు మాట్లాడుతూ, సుందరయ్య చనిపోయిన సంవత్సరంలో గాజువాక ప్రాంతంలో దశమికొండ, సుందరయ్య కాలనీ, స్వతంత్ర నగర్, రాసలమ్మ కాలనీ, భానోజీతోటలో సిపిఎం అనేక పోరాటాలు చేసి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు సాధించిందని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు యువిఎస్ఎన్.వర్మ మాట్లాడుతూ, సుందరయ్య తన యావత్ ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చేసిన నిస్వార్థ నాయకుడు అన్నారు. జెవివి జిల్లా నాయకులు డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ, సుందరయ్య పరిసర గ్రామ ప్రజలకు మందులు, నిత్యావసర సరుకులు పట్టణాలలో కొని, తెచ్చిన రేట్లకే సరఫరా చేసే మహా నాయకుడని అన్నారు. సిఐటియు నాయకులు కె.కిరీటం మాట్లాడుతూ, తన పేరు చివర ఉన్న రెడ్డి పదాన్ని తొలగించి సాధారణమైన జీవితాన్ని గడిపారని గుర్తుచేశారు. ఐద్వా నాయకులు కె.సంతోషం మాట్లాడుతూ, మహిళలు స్వయం శక్తితో జీవనం సాగించాలని పిలుపునిచ్చిన మొదట తరం నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు, పి.నర్సింగరావు, గాజువాక జోన్ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ఎల్.కృష్ణారావు, యూత్ నాయకులు రేగు మోహన్, కె.శ్రీదేవి, సింగిరెడ్డి లక్ష్మి, విద్యార్థి సంఘ నాయకులు పాలూరు టానీషా, గొంప గీతామాధురి మరడాన శ్వేత, గాద హేమ, మరడా అఖిల, మత్స్య ప్రణీత్‌కుమార్, గుంప సరస్వతి, ఉపాధ్యాయులు లక్ష్మి పాల్గొన్నారు.

గాజువాకలో నెహ్రూ వర్ధంతి

గాజువాక : గాజువాకలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన భారతదేశం మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి ప్రధానమంత్రిగా పనిచేసిన నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు ప్రవేశపెట్టి భారీ నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ములకలపల్లి రాజుబాబు, యరబాల భూలోక, వర్మ, కట్టా అప్పారావు, సనివాడ హరిబాబు పాల్గొన్నారు.

వీధి దీపం సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవలో మూడు నెలలుగా వెలగని ఐమాస్ట్ లైటు సమస్యకు పరిష్కారం లభించింది. ఐమాస్ట్ లైట్ వెలగడం లేదని స్థానిక ప్రజలు జనసేన నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. జనసేన సీనియర్ నాయకులు రాడి పెంటారావు స్పందించి వెంటనే జివిఎంసి అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేయించారు. దీంతో వీధి దీపం సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా పెంటారావు మాట్లాడుతూ, లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం పేరు చెప్పి అధికారులు సమస్యలు పట్టించుకోవడమే మానేశారని ఆరోపించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

వెలుగుతున్న వీధి దీపాలు

రుతుక్రమం - ఆరోగ్యంపై పోస్టర్ విడుదల

పోస్టర్‌ను విడుదలచేస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యాన ప్రోగ్రాం అధికారులతో రుతుక్రమం-ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. డాక్టర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ సమత, జిల్లా ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె ప్రోగ్రాం అధికారి ఆధ్వర్యాన రైల్వే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి అవగాహన సదస్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. "టుగెదర్ ఫర్ ఎ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్" (నెలసరి సమయంలో స్నేహపూర్వకంగా ఉండటం) ఈ సంవత్సరం నినాదంగా తీసుకున్నట్లు వివరించారు. అనంతరం డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ, ఆడవారికి సాధారనంగా 10 నుంచి 14 ఏళ్లలోపు మొదలై 45 నుంచి 49 ఏళ్ల మధ్యలో ఆగిపోతుందని తెలిపారు. నెలసరి సమయంలో శారీరకంగాను, మానసికంగాను మహిళలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. వారిలో మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలని, పాఠశాలలు, కళాశాలకు వెళ్ళేలా అక్కడ అందుబాటులో ఉండే సానిటరీ నాప్కిన్స్, ఐరన్, ఫోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, మురళీకృష్ణ, ఐ.మనోరమ, డాక్టర్ హీనాదీక్షిత్, శాంతిప్రియ, నాగభూషణం పాల్గొన్నారు.

అందరూ సంయమనంతో వ్యవహరించాలి

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్నికల ఫలితాలు వెల్లువడనున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని పెంటకోట ఫంక్షన్ హాల్‌లో సోమవారం శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎస్‌పి మాట్లాడుతూ జూన్ 1వ తేదీన ఎగ్జిట్ పోల్స్ విడుదలవుతాయని చెప్పారు. 4వ తేదీన 6 అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో ఉందని చెప్పారు. ఈ సమయాల్లో అన్ని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించి, జిల్లాలో కౌంటింగ్ ప్రశాంతంగా జరిపేందుకు సహకారం అందించాలని కోరారు. కౌంటింగ్‌కు ముందుగాని, కౌంటింగ్ రోజు గాని, కౌంటింగ్ తర్వాత గాని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్స్ కానీ, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కానీ, పెన్ పేపర్ వంటి వాటిని అనుమతించరని తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, మందుగుండు సామాగ్రిని కాల్చకూడదని, ఎవరు కూడా గుంపులుగా ఉండకూడదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శంకరరావు, రూరల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు, కసింకోట ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్సైలు సత్యనారాయణ, అలీ షరీఫ్, అనకాపల్లి సబ్ డివిజన్ అధికారులు, అనకాపల్లి, కశింకోట మండలాల రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఐసిఆర్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

- తొలి రోజు 99 మంది హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలిసెట్ కౌన్సెలింగ్‌ను కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటిరోజు ఒకటి నుండి 12 వేల ర్యాంకుల వరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌కు బాలురు 56, బాలికలు 43 మంది మొత్తం 99 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారి ధ్రువపత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేశారు. మంగళవారం 12001 ర్యాంకు నుంచి 27 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఈ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు తమ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

దుక్కు దున్నుతున్న రైతు

ఆకుమడులకు దుక్కులు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

ఖరీఫ్ సీజన్లో భాగంగా వరి నాట్లుకు అవసరమైన ఆకుమడులను మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. కొద్దిరోజులుగా వాతావరణం చల్లబడటంతోపాటు వరి నారు వేసుకోవడానికి సమయం ఆసన్నం అవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని వడ్డాది, దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం తదితర గ్రామాల్లో రైతులు వరి విత్తనాల వేయడానికి ఆకుమళ్ళను దుక్కులు దున్నిస్తున్నారు.

నేడు బుచ్చయ్యపేట మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి.నాగేశ్వరిదేవి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ లోబడి సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎటువంటి తీర్మానాలు ఉండవని చెప్పారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

విస్తృతంగా కార్డన్ సెర్చ్

పలు ప్రాంతాల్లో రికార్డుల్లేని వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట

బుచ్చయ్యపేట మండల కేంద్రంలో కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుండి గ్రామంలోని ప్రతివీధిలోనూ, మెయిన్ రోడ్డులోనూ వాహనాలను తనిఖీ చేసి రికార్డులు లేని 58 ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పరవాడ : పరవాడ సిఐ బాల సూర్యారావు నేతృత్వంలో పరవాడ మండలం మంత్రి పాలెంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో మంత్రి పాలెం జన్మారమ్ అపార్ట్మెంట్ దగ్గర సరైన పత్రాలు, రికార్డులు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నరు. స్వాధీనం చేసుకున్న వాహనాలను పరవాడ పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు పరవాడ సిఐ బాల సూర్యారావు తెలిపారు.

సబ్బవరంలో..

సబ్బవరం : మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని స్థానిక సిఐ పిన్నింటి రమణ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలను, ఒక కారును సీజ్ చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా ఉండేందుకు వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని పోలీసులు ముమ్మురంగా చేపట్టారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి రికార్డులను ఆయా వాహనాల యజమానులు స్టేషన్‌కు తీసుకువచ్చి చూపించి తమ వాహనాల్ని తీసుకుని వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ధనుంజయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట మండలంలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీలో విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి

జూన్ 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ ఏడాది సకాలంలో పాఠ్యపుస్తకాలు అందే పరిస్థితి లేనట్లేనని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు విమర్శించారు. స్థానిక విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు సకాలంలో విడుదల చేయడంలో ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విఫలమయ్యారని విరుచుకుపడ్డారు. బయట మార్కెట్లో జూనియర్, సీనియర్ ఇంటర్ పాఠ్యపుస్తకాలను రూ.1550 నుండి రూ.1800 వరకు కొనుగోలు చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి కూడా పూర్తి స్థాయిలో దొరకడం లేదన్నారు. వ్యాపారులు పాఠ్యపుస్తకాలకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని ఆరోపించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ 2025లో సిబిఎస్ఈ సిలబస్ ప్రవేశపెడతామన్న కారణంతో ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇవ్వవలసిన పాఠ్యపుస్తకాలను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన చిత్రకళ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం చిత్ర కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ శిబిరంలో భాగంగా చిత్రకళపై శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు నిర్వాహకులు ఆధ్వర్యంలో కళానిలయం వ్యవస్థాపక కార్యదర్శి బి.సూర్య నారాయణ, డ్రాయింగ్ టీచర్ ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన ముఖ్య అతిథులు మాట్లాడారు. చిత్రకళల ద్వారా విద్యార్థిని విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని చెప్పారు. అభిరుచున్న పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ సభ్యులు డిఎస్ ప్రసాద్, బిఆర్ అంబేద్కర్ భవనం అధ్యక్షులు దేముడు మాస్టారు, సాకేత్ ఫౌండేషన్ ప్రకాష్, తెలుగు పండితులు కొండలరావు, విశ్వనాధ్, పోస్ట్ మాస్టర్ కృష్ణ, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు చూపుతున్న చిన్నారులు

ప్రజాసంఘాల పోరాటంతో ఉపాధి హామీ కూలీలకు పనులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

ప్రజా సంఘాల పోరాటంతో మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు సోమవారం నుంచి అధికారులు పనులు కల్పించారు. 'ఉపాధి హామీ పనులు కల్పించరూ..' శీర్షికన ప్రజాశక్తి ఇటీవల వార్త ప్రచురించడం, ఇదే విషయంపై ఈ నెల 25న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు ఆధ్వర్యాన తిమ్మరాజుపేట గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించడంతో ఎంపీడీవో సురేష్ కుమార్ స్పందించారు. పనిచేయటానికి సిద్ధంగా ఉన్న ఉపాధి హామీ కూలీల వివరాలను సంబంధిత సిబ్బంది ద్వారా సేకరించారు. ఆవ నుంచి తిమ్మరాజుపేట, పెదపాడు మీదుగా వెళ్లే సైతాన్ కాలువ పూడిక తీత పనులు చేయటానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం అధికారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఉపాధి పనులు ప్రారంభ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, ఎస్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో టి వసంత కుమార్, సరగడం శివ బాబు నాయుడు, కే జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ పనులను హరిపాలెం విఆర్ రామలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. పనులు కల్పించి ఉపాధి కల్పించినందుకు ప్రజాసంఘాల ప్రతినిధులకు అధికారులకు ఉపాధి కూలీలు ధన్యవాదాలు తెలిపారు. గత సంవత్సరంలో చేసిన పనులకు కూలి సొమ్ము వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా కూలీలు కోరారు. ఈ సందర్భంగా ఏపీఓటి వసంత కుమార్ మాట్లాడుతూ చేసిన పనిని బట్టి కూలి సొమ్ము గిట్టుబాటు అవుతుందన్నారు. ఎంత పని చేస్తే అంత కూలీ వస్తుందని చెప్పారు.

ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న ప్రజాసంఘాల నేతలు, అధికారులు

జాబ్ మేళాకు హాజరైన విద్యార్థినులు

డివిఎన్‌లో మెగా ఫార్మా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా ఫార్మా ఉద్యోగ మేళా నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నాలకు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీలైన అరబిందో, హెటిరో డ్రగ్స్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్, వశిష్ట ఫార్మా, సైన్ఫిటిక్స్ ల్యాబ్స్ ప్రతినిధులు అనకాపల్లి రూరల్ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ మౌఖిక పరీక్షలను విద్యార్హత, వయోపరిమితి, అనుభవం ఆధారంగా నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలకు విచ్చేసిన 500 పైగా అభ్యర్థులలో 100 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సూచనల మేరకు ప్రతి సంవత్సరం తమ కళాశాలలో ప్రాంగణ నియామకాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఒక ఉద్యోగంతో కళాశాల నుండి బయటకు వెళ్లాలని ఇటువంటి ప్రాంగణ నియమకాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు పొలమరశెట్టి రాజేష్, కాండ్రేగుల అప్పలరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, ఎస్ఆర్ జమీర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

భారత దేశంలో యోగాకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి

భారతదేశంలో యోగకు కూడా ప్రాధాన్యత ఉన్నదని మాజీ మంత్రి, జనసేన పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. జార్జ్ క్లబ్ భారత స్వాభిమాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పతాంజలి యోగా ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ యోగ, ప్రాణాయామం మానసిక ఒత్తిడిని తగ్గించి జ్ఞాపక శక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత బయట ఆహారం కలుషితంగా ఉంటుందని అవకాశం ఉన్నంత వరకు సాత్విక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వామి రితిదేవ్‌జీ, జార్జ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్ఎంకె జోగి నాయడు, బుద్ద కాశీ విశ్వనాథ్, వి చంద్రశేఖర్, డాక్టర్ సుందర్రాజు పెరుమాళ్ళు, రవి, జొన్నలగడ్డ శ్రీనివాస్, టిఎన్‌వి ప్రసాదరావు, టి.సాయి నాగేశ్వరావు, కృష్ణశ్రీ, భీశెట్టి దొరమ్మ నాయడు, జి మంగయ్య, సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొణతాల శివాజీ, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, ఆడారి చిన వీరనాయుడు, కర్రి గంగాధర్, వంశీధర్, రోహిణి యోగ సాధకులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి- సబ్బవరం

ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్ట విత్తనాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50శాతం రాయితీపై అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జనుము 15 క్వింటాళ్లు, జీలుగ 8 క్వింటాళ్లు, పిల్లి పెసర 8 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు ఎకరాకు 12 నుండి 15 కిలోలు వేసుకోవచ్చని చెప్పారు. 40 నుండి 45 రోజుల్లో పూత దశలో ఉన్నప్పుడు భూమిలో కలియ దున్నడం వలన సేంద్రియ ఎరువులుగా ఉపయోగపడుతుందని తెలిపారు. దీనివల్ల రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను పండించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన వరి విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పచ్చి రొట్ట విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు

జిల్లా దేవాదాయ శాఖ అధికారి కెఎల్.సుధారాణి

ప్రజాశక్తి-కె.కోటపాడు

ట్రస్టీల సాగులో ఉన్న దేవాదాయశాఖ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా దేవాదాయ శాఖ అధికారి కెఎల్.సుధారాణి తెలిపారు. మండలంలోని ఆర్లి గ్రామంలో గల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ భూములపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం దర్యాప్తునకు వచ్చిన సుధారాణి స్థానిక విలేకరులతో మాట్లాడారు. కింతాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు ఆలయ భూములోని ఫలసాయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టారని, ఆ భూమిని ఇతరలకు లీజుకు ఇస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. భ్రమరాంబిక మల్లికార్జున ఆలయానికి చెందిన 13.2 ఎకరాల భూమిని పరిశీలించగా వాస్తవాలు వెలిగిలోకి వచ్చాయని తెలిపారు. ఆలయానికి ధూప దీప నైవేద్యాల నిర్వహిస్తూ, ఆలయ భూముల్లో ఫలసాయాన్ని అనుభవించే విధంగా ఈ భూమిని అర్చకుడైన వీరభద్రంకు 1976లో ఇవ్వడం జరిగిందని తెలిపారు. అప్పట్లో మేనేజింగ్ ట్రస్టీగా బండారు అక్కన్నపాత్రుని నియమించడం జరిగిందన్నారు. ట్రస్టీలు పరిరక్షణలో ఉండటం వలన ఈ దేవాలయానికి ఎగ్జిక్యూటివ్ అధికారిని ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్రస్టీల నిర్వహణలో ఉన్న దేవాలయ భూమి చేతుల మారి పరుల ఆధీనంలో పోతుందని ఫిర్యాదులు రావడంతో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజలను పెద్దలను గుడిలో ధూప దీప నైవేద్యాలు నిర్వహిస్తున్న అర్చకులను విచారణ జరిపినట్లు తెలిపారు. దేవాదాయ భూమిని సంబంధిత అధికారులకు తెలియకుండా లీజుకు ఇవ్వడం చెల్లదని ఆమె స్పష్టం చేశారు. ఈ దేవాలయానికి ఎండోమెంట్ అధికారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని, తమ విచారణ రుజువైన అన్ని వివరాలను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఒక నివేదికను సమర్పిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, గ్రూప్ టెంపుల్స్ అధికారి కే శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శర్మ పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న జిల్లా దేవాదాయశాఖ అధికారి సుధారాణి

ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పరవాడ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని తానాం చెరువులో ఉపాధి హామీ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా, రోజు కూలి రూ.600కు తక్కువ కాకుండా కూలి పెంచాలని కోరారు. తట్టా పారా, గునపం వంటి పరికరాలకు డబ్బులు చెల్లించాలని, మంచినీటికి, దూరానికి వెళ్లే వారికి రవాణా చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలం నిమిత్తం 30 శాతం అదనపు అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధి హామీ కార్మికులు పార్వతి, రమణమ్మ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ఉపాధి హామీ కూలీలకు 30 శాతం వేసవి అలవెన్స్ అదనంగా చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు కనీసం 300 రూపాయలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటికీ ఆ డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో టెంట్ వేయాలని, తాగునీరు, మెడికల్ కిట్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెల్లూరు నూకన్న, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న బ్రాండిక్స్ ప్రతినిధి దొరస్వామి

అభయాంజనేయ ఉత్సవాలకు రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాల నిర్వహణకు బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ గోస్వామి దొరస్వామి రూ.50వేలు విరాళాన్ని నిర్వాహకులు భీశెట్టి రాముకు 50 సోమవారం అందజేశారు. గ్రామంలో గత మూడు రోజులుగా అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా అంతర్రాష్ట్ర కోలాట పోటీలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా దొరస్వామి ఆదివారం రాత్రి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకమైన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు దొరస్వామిని సాల్వాతో ఘనంగా సన్మానించారు. మహిళలు ప్రదర్శించిన కోలాట పోటీ ఇల్లును ఆయన తిలకించి ఆనందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ భారతీయ సంస్కృతి వికాసానికి మరింత దోహదం చేస్తుందన్నారు. ఆదివారం రాత్రి తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా కాకతీయ కళాబృందం వారిచే ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి బాబు నాయుడు, ఆలయ ధర్మకర్త భీమిశెట్టి రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఏపీ పాలిటెక్నికల్ కెమికల్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ బివి లక్ష్మణరావు, గ్రామ ఉత్సవ కమిటీ చైర్మన్ భవిరిశెట్టి రవికుమార్, కర్రి ఆదిబాబు, ఎస్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్‌లో ఉద్యోగ సాధకుల దినోత్సవం

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ సాధకుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో క్యాంపస్ ఇంటర్వ్యూలకు 116 మందికి అర్హత ఉండగా 85 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అత్యధిక ప్యాకేజీ 2.73తో కళాశాల విద్యార్థులు ఉద్యోగం సాధించినట్లు చెప్పారు. సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రుల చేతుల మీదుగా ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణేష్, టిపిఒ జనార్దన్, విభాగాధిపతులు పి.రమణ కుమార్, బి.జగన్మోహిని, ఏం జగదీశ్, వై.వీరేంద్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రమాదాలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని లంకెల పాలెం నుండి పరవాడ వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రమాదం జరిగి చాలా రోజులైనా ఇంతవరకు అధికారులు దానిపై చర్య తీసుకోలేదని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సోమవారం కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. దీనిపై ఆయన వెంటనే స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు కార్పొరేటర్ శ్రీనివాస్ తెలిపారు. దీని వల్ల సర్వీసు రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని కార్పొరేటర్ చెప్పారు. తెలిపారు. కమిషనర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ అభ్యర్థి రమేష్‌ను కలిసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి - కశింకోట

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం కూటమి అభ్యర్థి సియం.రమేష్‌ను కూటమి నాయకులు సోమవారం అనకాపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌ను కలిసిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, సోమవారం సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, కూటమి నాయకులు గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఉలింగల రమేష్, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, ఆండ్రా ప్రసాద్, సిద్దిరెడ్డి శ్రీను, నారిపిల్లి ప్రసాద్ పాల్గొన్నారు

విజ్ఞానం.. వినోదం...

గ్రంథాలయాల్లో కొనసాగిన వేసవి శిబిరాలు

కోటవురట్లలో అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

చీడికాడలో ఆటలు ఆడుతున్న పిల్లలు

ప్రజాశక్తి-కోటవురట్ల:వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని విశ్రాంత గ్రంథ పాలకులు మురళీకృష్ణ సూచించారు. సోమవారం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థులంతా ప్రతిరోజు గ్రంథాలయాలకి వచ్చి నీతి కథలతో కూడిన పుస్తక పఠనాలు చేయాల న్నారు. ఈ సందర్భంగా ఆయన పలు నీతి కథలను వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి అప్పలనాయుడు, మస్తాన్ పాల్గొన్నారు.

చీడికాడ:చిన్నారులకు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని శాఖ గ్రంధాలయాధికారిని ఎంఎస్ ఎల్ జోగేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, విద్యార్థులకు కథలు, డ్రాయింగ్ వంటి వంటి వాటిని నిర్వహిస్తున్నామన్నారు.ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కే.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్ సూచించారు.

నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యూస్ పేపర్ రీడింగ్ నిర్వహించారు.విద్యార్థులు ప్రతిరోజు వార్తాపత్రికలు చదివే అలవాటు అలవర్చుకోవాలన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం 14 సంవత్సరాల లోపు పిల్లలకు పద్యాల పోటీలను, 14 నుంచి 16 సంవత్సరాల లోపు బాలలకు "మత్తు పదార్థాలు- మాదకద్రవ్యాలు- యువత" అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం ప్రముఖ రచయిత కె. సత్తిరాజు సుమతీ శతకం, వేమన శతకం, కుమారి శతకం, భాస్కర శతకం మొదలైన వాటిలోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క పద్యం అయినా నేర్చుకోవాలని ఆయన సూచించారు. వివిధ సామాజిక అంశాలపై ర్యాలీలు, మానవహారాలను ఎలా ఏర్పాటుచేయాలి.. నినాదాలు ఎలా ఇవ్వాలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి వివరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇపిఎస్.భాగ్యలక్ష్మి, కె.సత్తిరాజు, వి.అజయ్ కుమార్ వ్యవహరించారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయాధికారి మహేష్, విశ్రాంత హెచ్ఎం దత్తి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం 'సరదాగా ఇంగ్లీషు గ్రామర్' క్లాసులు నిర్వహించారు. సుమారు పాతిక మంది విద్యార్థులు పాల్గొనగా, హైస్కూలు ఉపాధ్యాయులు రత్నరాజు ఇంగ్లీష్ గ్రామర్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ వి.ఆనంద్ మాట్లాడుతూ టైం టేబులు లేని క్లాసులు, కోరుకున్న సబ్జక్టుల్లో ఆసక్తి కలిగిన విద్యార్థుల కోసం ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. మార్కుల్లేని టాలెంట్, పరీక్షల్లేని పాఠాలు సమ్మర్ క్యాంపు ప్రత్యేకతలని పేర్కొన్నారు. బాలికలకు మ్యూజికల్ ఛైర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజకల్ డైరెక్టర్ కె.దుర్గారావు పాల్గొన్నారు.

34 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి -చీడికాడ: ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు గాను మండలానికి 34 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు సరఫరా అయ్యాయని మండల వ్యవసాయ అధికారిణి ఎం.రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రైతులకు గాను జీలుగ 12 క్వింటాళ్లు, జనము 21.2 క్వింటాళ్లు, పిల్లి పెసర 1.04 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. వీటిని మండలంలోని 13 ఆర్‌బికేలకు వీటిని సరఫరా చేస్తామన్నారు. ఒక కిలో జీలుగ రూ.88 కాగా, రాయితీ పోను రూ.44 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనము ఒక కిలో రూ.88 కాగా రూ.44 సబ్సిడీ పోను రైతు రూ.44, పిల్లి పెసర ఒక కిలో రూ.134 కాగా సబ్సిడీ రూ.67 ఫోను రైతు రూ.67 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకము, ఆధార్ కార్డు తీసుకుని తమ గ్రామానికి దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో తమ పేరును నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు.

ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఎబిఎం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఏబిఎం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ (నక్కపల్లి యూనిట్) నిర్వహణలో హెచ్ఆర్‌లు ఐ.నరేష్, ఎం.తేజల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇందులో బీఎస్సీ కెమిస్ట్రీ సబ్జెక్టు చదివిన 40 మంది హాజరు కాగా 15 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు సహకారంతో నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అనిత

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజున పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత సూచించారు. నక్కపల్లి లో క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహం వద్ద సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పూర్తి అవగాహన కలిగిన వ్యక్తులను ఏజెంట్లుగా నియమించాలన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతంలో తగాదాలు, ఇబ్బందులు ఎదురైతే సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. శాంతియుతంగా ఉండాలని, కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు ఓపికతో ఉండాలన్నారు. భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు .

రోడ్డు నాణ్యతపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తిగలవలస పంచాయతీ కామయ్యపేట తారు రోడ్డు నిర్మించిన రెండు నెలలకే దెబ్బతిందని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ సర్పంచ్ కిల్లో రామారావు స్థానిక ప్రజలతో కలిసి సోమవారం తారు రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్నపాటి వర్షానికి రోడ్డు గుంతలు పడి శిథిలమై పోయిందన్నారు. నాసిక రకంగా రోడ్డు వేశారన్నారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే గుత్తేదారులు ఇష్టారాజ్యాంగా పనులు చేపడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాణ్యత ప్రమాణాలు గాలికి వదిలేశారని, జరిగిన అవినీతి పై తక్షణమే విచారణ చేపట్టి తారు రోడ్డు తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీదరి భాస్కరరావు, కిల్లో కామరాజు, పాంగి చిరంజీవి, పాంగి కృష్ణారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు ప్రదానం

చిన్నారులతో అకాడమి నిర్వాహకులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:విశాఖ నగరంలో ఈనెల 26న బొత్స కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన గ్రాండ్ మాస్టర్ కరాటే సెమినార్‌లో నర్సీపట్నంకు చెందిన 9 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను కనపరిచారు. జపాన్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ టకేసి మసాయమా ఆధ్వర్యంలో కరాటేలో అడ్వాన్స్ టెక్నిక్‌లు నేర్చుకోవడంతో పాటుగా, సెమినార్‌లో విశేష ప్రతిభ కనబరిచి, ప్రశంసా పత్రాలను సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం నిర్వహించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఛైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ కలగర్ల నాగజ్యోతి, ప్రముఖ స్విమ్మర్ కలగర్ల సాహితి, కోచ్ ఆర్ ప్రసాద్(చిన్నా) పాల్గొన్నారు.

శిథిలమై ఊడిపోయిన రక్షణ గోడ

వంతెన రక్షణ గోడ శిథిలం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట మీదుగా చింతపల్లి వెళ్లే దారిలో అల్లూరి పార్కు వద్ద వంతెన ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరింది. దీంతో, రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. పలు మార్లు ప్రయాణికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి రక్షణ గోడ మరమ్మతుపై అధికారులు దృష్టి సారించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

దుక్కుదున్నుతున్న రైతు

వేసవి దుక్కులతో లాభదాయకం

ప్రజాశక్తి- కోటవురట్ల:ఇటీవల కురిసిన వర్షాలకు వేసవి దిక్కులలో రైతులు నిమగ్నమయ్యారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే రైతాంగం సిద్ధమవుతోంది. ఈ తరుణంలో వేసవి దుక్కుల ఉపయోగాలపై మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ మాట్లాడుతూ, వేసవి దుక్కులతో భూమికి ఎంతో ఉపయోగ ఉంటుందన్నారు. చీడపీడల నివారణ కలుపు నియంత్రణ సహా పంట వ్యర్థాలు సద్వినియోగం వంటి ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. భూమిలో ఉండే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వాటిని నిర్మూలించేందుకు వేసవి దుక్కులు ఉపయోగపడుతుందన్నారు.మండల వ్యాప్తంగా రానున్న ఖరీప్ సీజనకు సంబంధించి విత్తనాలు, ఎరువులు తంతనాల రూపొందిస్తున్నామని రైతులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచుతామన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలీసెట్ - 2024 కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేపట్టారు ఈ సందర్భంగా సీతిని బాలధరణి (ర్యాంకు 1830) అనే విద్యార్థిని సర్టిఫికెట్లను కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.రామచంద్రరావు, ఛీప్ వెరిఫికేషన్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు వెరిఫికేషన్ చేశారు. సోమవారం 1 నుండి 12వేల ర్యాంకులు సాధించిన 58 మంది విద్యార్థుల సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేశారు.

సర్వేను పర్యవేక్షిస్తున్న శకుంతల

జిల్లాలో 327 మంది

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

ప్రజాశక్తి- కొత్తకోట: ఇప్పటివరకు జిల్లాలో 327 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించామని జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల తెలిపారు. రావికమతం మండలం మరుపాక గ్రామంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వేను మండల విద్యాశాఖ అధికారులు తలుపులు, బ్రహ్మానందంలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల విలేకర్లతో మాట్లాడుతూ, ప్రత్యేక ఉపాధ్యాయులతో ఈనెల 1వ తేదీ నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో కొత్తగా 327 మందిని, రావికమతం మండలంలో 14 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తే వారికి అవసరమైన సేవలను, సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,485 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు రూ.37 లక్షల 86 వేల అలవెన్సులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేడివాడ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, సరోజినీ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

కొండదొర తెగను

ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -పాడేరు : వైసీపీ ప్రభుత్వం ఎస్టీ కొండ దొర తెగ ను ప్రభుత్వ వెబ్ సైట్ నుండి తొగించిందని, తక్షణమే పునరుద్ధరణ చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీతకు సోమవారం అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ, ఎస్టీ కొండ దొర తెగను వెబ్ సైట్ నుండి తొలగించి 100 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ఎస్టీ జాబితాలో వాల్మీకిలను, రెండవ సారి భగత కులాన్ని, మూడవ సారి గౌడు కులస్తులను, నాలుగో సారి 'కొండదొర' తెగను తొలగించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన వ్యవస్థపైనే దాడులు చేస్తోందన్నారు. ప్రభుత్వం కుల వెబ్ సైట్ నుండి తొలగించి కక్ష సాదిస్తుందని, అదీ కూడా అకడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభం చేయడం అన్యాయమన్నారు. ఆ తెగలో చదువుతున్న విద్యార్థులు కేస్ట్ సర్టిఫికేట్‌లు పొందలేక పోతున్నారని, ఈ కారణంగా రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో చేరే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్య పరిష్కారం చేయాలని కలెక్టర్ను కోరారు.

హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. గిరిజనులకు కేటాయించే ఎస్టీ,ఎస్సి సబ్‌ప్లాన్ నిధులు, పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి ఇచ్చే సీసీడీపీ నిధులు పక్కదారి పట్టించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు పాల్గొన్నారు.

తగ్గిన దిగు(రా)బడి

- ఆశాజనకంగా లేని జీడి, మామిడి సాగు
- నష్టపోయిన రైతులు, కౌలు రైతులు
- వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, మంచు ప్రభావమే కారణం

ఈ ఏడాది మామిడి, జీడి రైతులకు నిరాశ మిగిల్చాయి. ఫలసాయం పై నమ్మకం పెట్టుకుని కుదేలయ్యారు. కౌలు రైతులు అప్పుల ఊబి లో కూరికిపోయారు. వాతావరణం అనుకూలించక పోవడంతో మామిడి, జీడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మామిడికాయ లేదు. జీడి చెట్లకు పిక్కలేదు.

ప్రజాశక్తి -నక్కపల్లి: మార్చి నెల వచ్చిందంటే మామిడి చెట్ల ప్రతి కొమ్మకు కాయలతోనూ, జీడి చెట్లు గుత్తులు గుత్తులుగా పిక్కలతో కళకళలాడుతూ కనిపించేవి. కానీ ఎక్కడా ఆ జాడ కనిపించలేదు. లోటు వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, పూత సమయంలో మంచు ప్రభావం కారణంగా జీడి, మామిడి దిగుబడి పూర్తిగా పడిపోయింది.

మండలంలోని సుమారుగా మామిడి తోటలు 5 వేల ఎకరాల్లోనూ, జీడి తోటలు 4 వేల ఎకరాల్లోనూ ఉన్నాయి. నక్కపల్లి, ఉపమాక, ఎన్.నరసాపురం, చందనాడ, బుచ్చిరాజుపేట, డిఎల్ పురం, రాజయ్యపేట, కాగిత, వేంపాడు, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల, రేబాక, ఉద్దండపురం, డొంకాడ, జానకయ్య పేట, పెదతీనార్ల, తదితర గ్రామాల్లో మామిడి, జీడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఏడాదికి ఒక్కసారి వచ్చే తోటల ఫలసాయంపై ఆయా గ్రామాల రైతులు ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. మామిడి, జీడి తోటలను కౌలు రైతులు ముందుగానే కౌలుకు తీసుకుని అడ్వాన్సులు ఇచ్చారు. దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో వీరంతా నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. కొన్నిచోట్ల అక్కడక్కడ మామిడి చెట్లకు కొన్ని కాయలు, జీడి తోటల్లో అక్కడక్కడ కొన్ని పిక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో తోటల్లో మామిడికాయ లేదు, జీడి పిక్క కనిపించ లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మామిడి, జీడి ఫలసాయం పూర్తిగా తగ్గింది.

దిగుబడి పూర్తిగా తగ్గింది

ఈ ఏడాది జీడి తోట పూర్తిగా నిరాశే మిగిల్చింది. ఎకరంన్నర జీడి తోటలో ఏ చెట్టుకు ఒక పిక్క కూడా లేదు. వర్షాభావంలోటు, మంచు ప్రభావం, అధిక ఉష్ణోగ్రత కారణంగా జీడి తోట పూర్తిగా దెబ్బతింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

కొల్లాటి నారాయణరావు, రైతు ,ఉపమాక

కాయలేని మామిడి చెట్టు

పిక్కలు లేని జీడి చెట్లు

దిగుబడి పడి పోవడంతో రైతులు, కౌలు రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. మామిడి, జీడి తోటలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్ట పోయామని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు .కౌలు రైతుల బాధలు వర్ణణాతీతం. లక్షలాది రూపాయలు అడ్వాన్సులు ఇచ్చి అప్పుల ఊభిలో చిక్కుకుపోయి, ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సాగని మామిడి, జీడి వ్యాపారం

మామిడి, జీడి దిగుబడి పూర్తిగా తగ్గడంతో వ్యాపారులు సతికిల పడ్డారు. చినదొడ్డుగల్లు కేంద్రంగా ప్రతి ఏడాది భారీ ఎత్తున మామిడికాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తూ ఉంటారు.మామిడి దిగుబడి తగ్గడంతో వ్యాపారాలు సాగలేదు. ఉపమాక, నక్కపల్లి ప్రాంతాల్లో జీడిపిక్కల వ్యాపారం సాగిస్తుంటారు. చిరు వ్యాపారులు రైతుల నుండి జీడిపిక్కలు కొనుగోలు చేసి ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. జీడిపిక్కల దిగుబడి కూడా తగ్గడంతో వ్యాపారాలు కుంటుపడ్డాయి.

దెబ్బతీసిన వాతావరణం

వాతావరణ పరిస్థితులు జీడి, మామిడి తోటలను బాగా దెబ్బతీశాయి. గత ఏడాది లోటు వర్షపాత ప్రభావం జీడి, మామిడి తోటలపై పడింది. డిసెంబర్, జనవరి నెలలు ఈ తోటలకు కీలకం. ఈ సమయంలో మంచు అధికంగా కురవడంతో పూత నల్లగా మాడిపోయింది. పిందెలు నిలవలేదు. దీంతో కాపు బాగా తగ్గింది. అధిక ఉష్ణోగ్రత ప్రభావం కూడా తోటలపై చూపాయి. దీనికి తోడు తెగుళ్ళు తోటలపై దాడి చేశాయి. దీంతో దిగుబడి పూర్తిగా పడిపోయింది.

నిరాశే మిగిలింది

ఈ ఏడాది మామిడి దిగుబడి పూర్తిగా నిరాశే మిగిల్చింది. నాకు 70 సెంట్లు మామిడి తోట ఉంది. ఇది కాకుండా మరో 2 ఎకరాల మామిడి తోటను 40 వేల రూపాయలకు కౌలుకు తీసుకున్నాను. తోట దున్నేందుకు, క్రిమిసంహారక మందులు, ఎరువులు వేసేందుకు సుమారుగా 20 వేల వరకు అప్పు చేసి పెట్టుబడులు పెట్టాను. కానీ మామిడికాయ లేదు. దీంతో ఆర్థికంగా నష్టం వాటిల్లింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి ఫలసాయం దెబ్బ వేసింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాను.

ప్రగడ అప్పారావు (బుజ్జి), కౌలు రైతు ,ఉపమాక

శ్రీశ్రీశ్రీ పెదపైడిమాంబ జాతర మహోత్సవ శుభాకాంక్షలు
శ్రీశ్రీశ్రీ పెదపైడిమాంబ అమ్మ వారి ఉత్సవాలకు తరలివస్తున్న యావన్మంది భక్తులకు, ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రొ: ర్యాలీ సూర్యనారాయణ
శ్రీ కనక కామాక్షి జ్యూయలర్
బంగారం, వెండి నగల వ్యాపారం
మా వద్ద ఆర్డరుపై హాల్‌మార్క్ బంగారం ఆభరణములు, వెండి ఆభరములు సరికొత్త మోడల్స్‌లో తయారు చేసి సకాలములో ఇవ్వబడును.
మెయిన్‌రోడ్, చౌడువాడ గ్రామం, కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.
సెల్: 9966600891, 996660093

29న జిల్లా స్థాయి ఉషు సెలక్షన్స్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 29 జిల్లా స్థాయి ఉషు సెలక్షన్స్ జరగనున్నాయని ఎన్ఐఎస్ కోచ్‌లు వేపాడ ప్రియాంక, అరుణ సోమవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు 27 కేజీల నుండి 75 కేజీల విభాగంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరిలో బాలికలకు మాత్రమే జరుగుతాయని తెలిపారు. ఇందులో సెలెక్ట్ అయిన వారు ఖేలో ఇండియా నేషనల్ కు అర్హత సాధిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు నింజాస్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్ సీనియర్ కోచ్ శేఖర్ ఫోన్: 7382329353 నెంబరుకు సంప్రదించి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675